## క్లుప్తంగా

### కొడంగల్ ఎస్‌ఐ బదిలీ


ఎస్‌ఐ రవిగౌడ్

కొడంగల్: కొడంగల్ ఎస్‌ఐ రవిగౌడ్ దోమ పోలీస్‌స్టేషన్‌కు శుక్రవారం బదిలీ అయ్యారు. రానున్న సాధారణ ఎన్నికల నేపథ్యంలో బదిలీ అయినట్లు సంబంధిత అధికారులు పేర్కొన్నారు.

### ఘనంగా వీరాంజనేయ విగ్రహ ప్రతిష్ఠాపన


ఆలయంలో కొనసాగుతున్న పూజలు

దౌల్తాబాద్: మామిడికుంట గ్రామంలో శుక్రవారం వీరాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. హోమంతో పాటు, గణపతిపూజ, కలశ పూజ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. పూజా కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి, సర్పంచ్ నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### భక్తి మార్గంతో ముక్తి


ఆలయ నిర్వాహకులకు విరాళం అందజేస్తున్న మనోహర్‌రెడ్డి

పరిగి: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని డీసీసీబీ చైర్మన్ మనోహర్ రెడ్డి అన్నారు. బాబాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన పోచమ్మ దేవాలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయ అభివృద్ధికి రూ.70వేల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరు భక్తి భావాన్ని అలవర్చుకోవాలని, భక్తి మార్గంతోనే ముక్తి లభిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు అశోక్‌రెడ్డి, నాయకులు వెంకట్‌రాంరెడ్డి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

### శివాజీ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ


విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ చేస్తున్న నాయకులు

కుల్కచర్ల: ఛత్రపతి శివాజీని స్ఫూర్తిగా తీసుకొని యువత సమాజ అభ్యున్నతికి పాటుపడాలని ఛత్రపతి యువజన సంఘాల నాయకులు అన్నారు. శుక్రవారం కుల్కచర్ల మండలం పుట్టపహాడ్ గ్రామంలో శివాజీ విగ్రహ ఏర్పాటుకు యువజన సంఘాల నాయకులు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు వెంకట్రాములు, శేఖర్ గౌడ్, శివాజీ యువజన సంఘం నాయకులు బోయిని శ్రీనివాసులు, అవుసుల సతీష్, సంద్రస్ గోపాల్, మహేశ్వర్ రెడ్డి, కాకి శ్రీనివాసులు, బేతి చిన్న రాజు, కమ్మరి చింటు, చిల్ల అశోక్, సంద్రస్ బాలరాజు, బేతి నరేందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

### జీపీ భవన నిర్మాణానికి..


ముగ్గు పోస్తున్న నిర్మాణదారులు

మర్పల్లి: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని సర్పంచ్ ఇందిర అన్నారు. శుక్రవారం మర్పల్లి మండలం పట్లూర్‌లో కొత్తగా మంజూరు అయిన గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి ఆమె భూమి పూజ చేసి మాట్లాడారు. భవన నిర్మాణానికి జాతీయ ఉపాధిహామీ పథకం కింద రూ.20 లక్షల నిధులు మంజూరయ్యాయని చెప్పారు. నిర్మాణ పనులు త్వరగా పూర్తయ్యేలా కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంట్రాక్టర్ అశోక్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

### నాణ్యమైన ఎరువులు విక్రయించాలి

బొంరాస్‌పేట: రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలను అందజేయాలని, లేని యెడలా చర్యలు తప్పవని మండల వ్యవసాయ అధికారి తిప్పేస్వామి హెచ్చరించారు. శుక్రవారం ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. రికార్డులు, ఎరువులు, విత్తనాలను పరిశీలించారు. అలాగే పరీక్షించేందుకు నమూనాలను సేకరించారు.

# కలగానే కల్వర్టుల నిర్మాణం

- అధికారుల తీరు మారదు
- వాహనదారులకు గోస తప్పదు
- వర్షాకాలంలో స్తంభిస్తున్న రాకపోకలు!


రాంనగర్ గ్రామపంచాయతీ సమీపంలోని కల్వర్టు దుస్థితి

కుల్కచర్ల: రవాణా సౌకర్యం కోసం రహదారుల నిర్మాణం ఎంత ముఖ్యమో.. కల్వర్టులు అంతే ముఖ్యం. రోడ్ల నిర్మాణాల్లో భాగంగా మధ్య మధ్యలో వచ్చే వాగులు, వంకలు, కాల్వలు ఉన్న చోట్ల కల్వర్టులు, వంతెనలు నిర్మించాలి. కానీ ఇక్కడ తొమ్మిది కిలో మీటర్ల మార్గంలో నిర్మించిన మూడు కల్వర్టులు పూర్తి శిథిలావస్థకు చేరి, రాళ్లురప్పలు తేలి రవాణాకు అసౌకర్యంగా మారాయి. వర్షాకాలంలో రాకపోకలు స్తంభించి గ్రామాల మధ్య బంధాలు తెగిపోతుంటాయి.

**9కి.మీ. 3కల్వర్టులు**

కుల్కచర్ల మండల కేంద్రం నుంచి దోమ మండలం దాదాపూర్ గ్రామం వరకు 9కిలో మీటర్ల దూరం ఉండగా.. ఈ ప్రాంతంలో ఉన్న 3కల్వర్టులు అధ్వానంగా మారాయి. రాంనగర్ గ్రామపంచాయతీ కార్యాలయం దగ్గరలో వాగు వెళ్లే ప్రాంతంలో ఉన్న కల్వర్టు.. ప్రస్తుతం గుంతలు ఏర్పడి ఇబ్బందిగా మారింది. రాంనగర్ దాటగానే ఉన్న మరో కల్వర్టు.. ఇటీవల కురిసిన వర్షాలకు వరద ప్రవహించడంతో అది ధ్వంసమైంది. దోమ మండలం దాదాపూర్‌కు వెళ్లే దారిలో ఉన్న మరో కల్వర్టుపై పూర్తిగా తారు కొట్టుకుపోయి రాళ్లు తేలి.. వాహనదారులకు అసౌకర్యంగా మారింది. విషయం అధికారులకు తెలిసినప్పటికీ.. తగిన చర్యలు చేపట్టడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

### కాలినడకకు ఇబ్బందే..



ఉన్న కల్వర్టులు ధ్వంసమయ్యాయి. కొత్తవి నిర్మించకపోవడం వలన వాహనాల రాకపోకలతో పాటు, కాలినడకకు ఇబ్బందిగా ఉంది. వానాకాలంలో కల్వర్టుల వద్ద పయనించలేని దుస్థితి. ఇతర మార్గాల ద్వారా గమ్యానికి చేరుకోవాల్సి వస్తోంది.

– సంతోష్, రాంనగర్ గ్రామస్తుడు

### ప్రతిపాదనలు పంపాం

కుల్కచర్ల మండలం నుంచి దాదాపూర్ వరకు మూడు ప్రదేశాల్లో ఉన్న కల్వర్టుల స్థానంలో రెండు ప్రాంతాల్లో కొత్తగా వంతెనలు నిర్మించాల్సి ఉంది. మరోచోట కొత్తగా కల్వర్టు ఏర్పాటు చేయడంతో పాటు, రెండు బ్రిడ్జీలను రూ.70లక్షల నుంచి 80లక్షలతో నిర్మించేందుకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలను పంపించాం. త్వరలోనే నిధులు మంజూరయ్యే అవకాశం ఉంది.

– మహేశ్, ఆర్‌అండ్‌బీ ఏఈ, కుల్కచర్ల

# ఉపాధ్యాయుల బదిలీలు సహజం


ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న ప్రధానోపాధ్యాయుడు హరిలాల్ తదితరులు

దోమ: విధి నిర్వహణలో భాగంగా ఉపాధ్యాయుల బదిలీలు సహజమని కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు హరిలాల్ అన్నారు. శుక్రవారం దోమ మండలం గోన్యానాయక్ తండా అనుబంధ గ్రామమైన బద్యానాయక్ తండా ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న పి. పద్మావతి రంగారెడ్డి జిల్లా చౌదర్‌గూడ పాఠశాలకు మ్యూచ్‌వల్‌లో బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా పాఠశాలలో సహ ఉపాధ్యాయులు సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు ముఖ్యఅతిథిగా హాజరై సర్పంచ్‌తో కలిసి పద్మావతిని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటయ్య, ఉపాధ్యాయులు సంధ్యరాణి, స్కూల్ చైర్మన్ హరి, సీఆర్పీ వెంకటేశ్, అంగన్వాడీ టీచర్ దేవి తదితరులు పాల్గొన్నారు.

# ఈవీఎంల పనితీరు తెలుసుకోవాలి


ఓటింగ్ యంత్రాల పనితీరును ప్రజలకు వివరిస్తున్న రెవెన్యూ సిబ్బంది

తహసీల్దార్ బుచ్చయ్య

కొడంగల్ రూరల్: ఈవీఎంల పనితీరును ప్రజలు తెలుసుకున్నట్లయితే ఎలాంటి సమస్య ఉండదని తహసీల్దార్ బుచ్చయ్య అన్నారు. శుక్రవారం తహసీల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈవీఎంల అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించారు. కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్, ఈవీఎం, వీవీ పాట్‌ల పనితీరును వివరించారు. కంట్రోల్ యూనిట్ నుంచి బ్యాలెట్‌ను అందజేస్తారని, బ్యాలెట్ యూనిట్ అభ్యర్థుల వివరాలతో కూడిన గుర్తులు ఉంటాయని, ఓటరు తమకు నచ్చిన అభ్యర్థి గుర్తుపై నొక్కాలని చూపించారు. వీవీప్యాట్లతో తాము నొక్కిన అభ్యర్థి గుర్తు డిస్‌ప్లే అవుతుందని, 7 సెకన్ల పాటు ఉన్న గుర్తును ఓటరు గమనించాలన్నారు. ఓటు వేశాక మ్యూజిక్ ప్లే అవుతుందని, అప్పుడే ఓటు పూర్తయినట్లు ఓటరు గమనించాలని సూచించారు. మాక్ పోలింగ్ పద్ధతిలో ఓటర్లకు వివరించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ రాంచందర్, వీఆర్‌ఏలు మోహన్‌రావు, గోపాల్ పాల్గొన్నారు.

# జాతీయభావాలు పెంపొందించుకోవాలి


ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

కుల్కచర్ల: యువత జాతీయభావాలను పెంపొందించుకోవాలని ముజాహిద్‌పూర్ జెడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాములు అన్నారు. శుక్రవారం కుల్కచర్ల మండలం ముజాహిద్‌పూర్‌లో కేంద్ర ప్రభుత్వ, నెహ్రూ యువ కేంద్రం ఇచ్చిన పిలుపు మేరకు జెడ్పీ పాఠశాలలో 'మేరీ మతి మేరిదేశ్' అనే కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. యువత 'దేశం నాకు ఏమిచ్చింది.. నా దేశానికి నేనేమి చేశాను' అనే భావనతో ముందుకుసాగాలని సూచించారు. దేశ అభ్యున్నతిలో మన పాత్ర ఉండాలన్న సంకల్పంతో ముందుకుసాగాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మధుసూదన్, వెంకటేశం, శీనయ్య, కారోబార్ యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

# డీడీలు కట్టినా మీటర్లు ఇవ్వలే!

- విద్యుత్ సమస్యలపై స్పందించరు
- చేసిన పనులకు బిల్లుల చెల్లింపులో జాప్యం
- సర్వసభ్య సమావేశంలో సభ్యుల అసహనం
- సమస్యల పరిష్కారానికి చొరవ: ఎంపీపీ



అభివృద్ధి పనుల బిల్లుల విషయమై ఎంపీడీఓకు వివరిస్తున్న హాజీపూర్ సర్పంచ్ శ్రీనివాస్

యాలాల: 'గ్రామాల్లో విద్యుత్ సమస్యలు నెలకొన్నాయి. శిథిలావస్థకు చేరిన స్తంభాలను మార్చాలని, కిందకు వేలాడుతున్న తీగలను సరిచేయాలని విద్యుత్ అధికారులకు పలుమార్లు చెప్పాము. ట్రాన్స్‌ఫార్మర్లు, మీటర్ల కోసం డీడీలు కట్టినా వాటిని ఇంత వరకు ఇవ్వలేదు' అని దేవనూరు సర్పంచ్ శివకుమార్, ముద్దాయిపేట సర్పంచ్ కృష్ణయ్యగౌడ్ సభ దృష్టికి తేగా.. ట్రాన్స్‌కో ఏఈ విద్యుత్ సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతానని చెప్పారు. శుక్రవారం మండల పరిషత్‌లో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో పలువురు సభ్యులు గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సభ దృష్టికి తెచ్చారు. అక్కంపల్లి సర్పంచ్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ దేవనూరు రూట్‌లో నైట్ హాల్ట్ బస్సు నడపాలని, జుంటుపల్లి రూట్‌లో సాయంత్రం వేళ విద్యార్థులకు బస్సులేక అవస్థలు పడుతున్నారని సభలో ప్రస్తావించారు. మనఊరు–మనబడి కార్యక్రమంలో చేపట్టిన పనులకు సంబంధించి బిల్లుల చెల్లింపులో జాప్యం జరుగుతుందని, వెంటనే బిల్లులు మంజూరు చేయాలని ముద్దాయిపేట సర్పంచ్ కోరారు.

**పనులు చేయమంటరు.. బిల్లులు ఇవ్వరు!**

గ్రామీణాభివృద్ధికి సంబంధించి ఎంపీఓ యాదయ్య వివరాలు వెల్లడిస్తుండగా.. హాజీపూర్ సర్పంచ్ ఒంగోనిబాయి శ్రీనివాస్ మధ్యలో కలగజేసుకొని వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలో వివరించాలని కోరారు. ఇప్పటికే చేపట్టిన హరితహారం, శానిటైజేషన్ పనుల బిల్లులు రావడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. పింఛన్లు, రేషన్‌కార్డులు, భూ పట్టా పాసు పుస్తకాల కోసం చాలా మంది కార్యాలయాల చుట్టూ తిరిగి అలసిపోతున్నారని వాపోయారు. ఈ విషయంలో ఉన్నతాధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించేలా చొరవ తీసుకోవాలని కోరారు.

**చర్యలు తీసుకుంటా: ఎంపీపీ**

గ్రామాల్లో నెలకొన్న సమస్యల విషయమై సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తా తెలిపారు. చేసిన అభివృద్ధి పనుల బిల్లుల చెల్లింపులో జాప్యం జరగకుండా చూస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రమేష్, ఎంపీడీఓ పుష్పలీల, కోఆప్షన్ సభ్యుడు అక్బర్‌బాబా, మాజీ ఎంపీపీ కరణం పురుషోత్తం రావు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

# గోరింటాకు సందడి




చేతికి పెట్టుకున్న గోరింటాకును చూపిస్తున్న మహిళలు

తాండూరు: తాండూరు పట్టణం నగరేశ్వరస్వామి దేవాలయంలో శుక్రవారం వాసవీ మహిళాసంఘం సభ్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయంలోని కన్యకాపరమేశ్వరి అమ్మవారు శాకాంబరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా సాయంత్రం ఆర్యవైశ్య, వాసవీ సంఘం మహిళలు ఆషాఢమాసం సందర్భంగా గోరింటాకు ఉత్సవాలు నిర్వహించారు. అతివలు చేతికి మైదాకు పెట్టుకొని మురిసిపోయారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ తాటికొండ స్వప్నపరిమళ్, కౌన్సిలర్ సాహు శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీ భవన నిర్మాణానికి నిధులు


పంచాయతీ భవన నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న సర్పంచ్ జంగయ్య

సర్పంచ్ జంగయ్య

షాబాద్: పంచాయతీ భవన నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని మల్లారెడ్డిగూడ గ్రామ సర్పంచ్ చందిప్ప జంగయ్య తెలిపారు. శుక్రవారం షాబాద్ మండలం మల్లారెడ్డిగూడ గ్రామంలో రూ.20 లక్షలతో పంచాయతీ నూతన భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడలేని విధంగా సీఎం కేసీఆర్ అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేసి రాష్ట్రాన్ని దేశంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దారని తెలిపారు. మారుమూల ప్రాంతాలను అభివృద్ధి చేసి మౌలిక సదుపాయాలు కల్పించారని పేర్కొన్నారు. రైతులకు పెట్టుబడులు, రైతుబీమా పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ఆడపిల్లలకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ వంటి పథకాలను తీసుకువచ్చి, పేద కుటుంబానికి పెద్దదిక్కుగా నిలిచారని వెల్లడించారు. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ తదితర పథకాలను అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పరిగి గణేశ్‌గౌడ్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## చిన్న చూపు తగదు

షాబాద్: పంచాయతీ కార్మికుల డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ డిమాండ్ చేశారు. శుక్రవారం షాబాద్ మండల కేంద్రంలో మోకాళ్లపై నిలబడి పంచాయతీ కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా దేవేందర్ మాట్లాడుతూ తొమ్మిది రోజులుగా కార్మికులు విధులు బహిష్కరించి సమ్మె చేస్తున్నా.. ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. వారిని బెదిరింపులకు గురిచేస్తూ సమ్మెను విచ్ఛిన్నం చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. జీఓ 60 ప్రకారం వేతనాలు ఇవ్వాలని, 8 గంటలు పనిదినాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ యూనియన్ షాబాద్ మండల కార్యదర్శి నరసింహ, పంచాయతీ కార్మికులు తదితరులున్నారు.

# రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చండి


సమావేశంలో పాల్గొన్న నాయకులు

చేవెళ్ల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతాంగానికి ఇచ్చిన హామీలను అమలు చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ప్రభులింగం డిమాండ్ చేశారు. మండలంలోని ఆలూరు గ్రామంలో రైతు సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ అధ్యక్షతన శుక్రవారం రైతు సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు రైతులకు ఈ ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. రుణమాఫీ ఒకేసారి లక్ష రూపాయలు మాఫీ చేయాలన్నారు. గ్రామాల్లో రైతు సంఘాలను గ్రామ శాఖల ద్వారా బలోపేతం చేయాలని సూచించారు. రైతుల సమస్యలను పరిష్కరించేందుకు సంఘం నిరంతరం కృషి చేస్తుందని చెప్పారు. రైతులంతా కలిసి కట్టుగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు సుధాకర్‌గౌడ్, రైతు సంఘం మండల నాయకులు సూటి నర్సింహులు, గ్రామ కమిటీ నాయకులు దేవగోని మల్లేశ్, మల్లేశ్, పోశయ్య, శ్రీనివాస్, జంగయ్య, పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

### రైతు బీమాకు దరఖాస్తు చేసుకోండి

తాండూరు రూరల్: కొత్తగా పట్టాదారు పుస్తకాలు పొందిన రైతులు రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలని బెల్కటూర్ ఏఈఓ శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పట్టాదారు పుస్తకం, పట్టాదారు ఆధార్‌కార్డు, నామిని ఆధార్ కార్డుల జిరాక్స్ ప్రతులను బీమా ఫారానికి జతచేసి వ్యవసాయ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

**ఆగస్టు 5లోగా..**

బంట్వారం: అర్హులైన రైతులు గడువు లోగా రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయ శాఖ కోట్‌పల్లి ఏఓ గీత శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జూన్ 18 వరకు కొత్తగా పట్టాదారు పుస్తకం కలిగి ఉన్నవారు.. బీమా ఫారానికి పట్టా పుస్తకం, ఆధార్, బ్యాంక్ పాసు పుస్తకం జిరాక్స్ కాపీలు జతచేసి రైతు వేదికలో ఏఈఓలకు అందజేయాలన్నారు. ఆగస్టు 5లోగా దరఖాస్తు చేసుకోవాలని ఏఓ తెలిపారు.

### క్రమబద్ధీకరణ దరఖాస్తుల పరిశీలన

పెద్దేముల్: జీఓ నంబర్ 58, 59 ప్రకారం సర్వే నంబర్ 78 ప్రభుత్వ భూముల్లో 125 గజాల కంటే ఎక్కువ స్థలంలో నివాసం ఏర్పాటు చేసుకొని జీవిస్తున్న పేదలు.. క్రమబద్ధీకరణ కోసం ఇప్పటికే దరఖాస్తు చేసుకున్నారు. అయితే వారి అర్జీలను పరిశీలించేందుకు రెవెన్యూ అధికారులు రంగంలోకి దిగారు. ఇందులో భాగంగా పెద్దేముల్ మండలం బుద్వారంలో శుక్రవారం డిప్యూటీ తహసీల్దార్ మహేశ్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ) రాజిరెడ్డిలు పర్యటించి ఇళ్లను, అర్జీలను పరిశీలించారు. వారితో మాజీ సర్పంచ్ వెంకటయ్య, గ్రామస్తులు రాములు ఉన్నారు.

### ఇంటింటికీ మరుగుదొడ్లు తప్పనిసరి

కుల్కచర్ల: ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా మరుగుదొడ్డి నిర్మించుకోవాలని డీఆర్డీఓ ఏపీడీ నర్సింహులు కోరారు. శుక్రవారం కుల్కచర్ల మండలం బండవెల్కిచర్లలో స్వచ్ఛ సర్వేక్షన్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ తిరిగి మరుగుదొడ్లను పరిశీలించి మాట్లాడారు. ఇంటింటికీ మరుగుదొడ్డి అనేది తప్పనిసరని, అదే విధంగా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని, తడిపొడి చెత్తను వేరు చేసి గ్రామపంచాయతీ ట్రాక్టర్‌కు అందించాలని సూచించారు. ఏపీఓ వెంకటేశ్, ఏపీఎం శోభ, స్థానిక సిబ్బంది పాల్గొన్నారు.

# కార్మికులను రెగ్యులర్ చేయాలి


దౌల్తాబాద్: మెడకు తాళ్లు కట్టుకొని నిరసన తెలుపుతున్న కార్మికులు


తాండూరు రూరల్: కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన

తాండూరు రూరల్: సమస్యల సాధనకోసం పంచాయతీ కార్మికులు చేస్తున్న నిరవధిక సమ్మె శుక్రవారానికి 9వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఎంపీడీఓ కార్యాలయం వద్ద కార్మికులు అర్ధనగ్న ప్రదర్శన చేశారు. సమ్మెకు బీసీ సంక్షేమ సంఘం తాండూరు నియోజకవర్గ అధ్యక్షుడు రాజ్‌కుమార్ మద్దతు తెలిపారు.

**వినూత్న నిరసన**

దౌల్తాబాద్: సమ్మెలో భాగంగా జీపీ కార్మికులు మెడకు తాళ్లు కట్టుకొని వినూత్న నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు సాయిలు మాట్లాడారు. కార్మికులను వెంటనే రెగ్యులర్ చేయాలని, ప్రభుత్వం ప్రకటించిన విధంగా 11వ పీఆర్సీ జీవో 60ని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

### ట్రిపుల్ ఐటీకి పరిగి విద్యార్థి


విద్యార్థిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

పరిగి: పట్టణ కేంద్రంలోని నంబర్ 1 ఉన్నత పాఠశాల విద్యార్థి అబ్రార్ అహ్మద్ బాసర ఐఐఐటీకి ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా శుక్రవారం ఉపాధ్యాయులు విద్యార్థిని ఘనంగా సన్మానించారు. ప్రతిభ కనబర్చి పాఠశాలకు పేరు ప్రఖ్యాతులు తెచ్చినందుకు అహ్మద్‌ను అభినందించారు.

# మొక్కలు నాటారు.. మేకలను వదిలారు


అడవిలో నాటిన మొక్కలను తింటున్న మేకలు

ధారూరు: అడవిలో మొక్కలు నాటి చెట్లను పెంచాలని భావించిన అటవీ అధికారులకు మేకలు చుక్కలు చూపిస్తున్నాయి. ధారూరు మండలం రుద్రారం, నాగసమందర్ గ్రామాల మధ్య గల అడవిలో ఇటీవల నాటిన మొక్కలను మేకలు మేసేస్తున్నాయి. నాటిన మొక్కల సంరక్షణ బాధ్యతను విస్మరించడం వలనే మేతకోసం అడవిలోకి వచ్చిన మేకలు వాటిని తినేస్తున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. శిలాఫలకం వేసిన అధికారులు.. నాటిన మొక్కలను ప్రజా ప్రతినిధుల చేత ప్రారంభించాలనుకున్న నేపథ్యంలో మొక్కలను జీవాలు మేయడం చర్చనీయాంశంగా మారింది. అడవి చుట్టూ కందకాలు తవ్వి, ఎవరినీ లోపలికి వెళ్లకుండా చేశామని ఫారెస్టు అధికారులు చెబుతున్నా.. గొర్ల కాపరులు మాత్రం అడవిలోకి వెళ్లడానికి దారి చేసి, మేకలను వదలడం గమనార్హం.